

ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న అశ్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

'అశ్విత' ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అశ్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో భగవద్గీత శ్రవణం ప్రాముఖ్యతను తెలియజేశారు. పద్దెనిమిది అధ్యాయాలకు సంబంధించిన విషయాలను సవివరంగా తెలియజేశారు. ప్రవచన కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు పాపా రావు, ఉద్యమకార్యకర్త ప్రసాద్ సంధానకర్తలుగా వ్యవహ రించారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

మమతా అకాడమీలో స్వచ్ఛ భారత్

నిజాంపేట్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని మమతా అకాడమీ మెడికల్ కాలేజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మమతా అకాడమీ మెడికల్ సైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నయన్‌రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 150 మంది వైద్య విద్యార్థులు పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై పలువురికి అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో డాక్టర్లు సురేష్ పటేల్, ప్రణీత్, విద్యార్థులు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వం ఇస్తున్న బీజేపీ నాయకులు

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలి

జీడిమెట్ల, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.వాసు అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి సభ్యత్వం చేయించాలన్నారు. కార్యక్రమంలో అంగడి మల్లేష్, దేవర రమేష్, విజేందర్‌రెడ్డి, విఘ్నేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మసీద్‌కు రూ.50 వేల విరాళం



దుండిగల్ మున్సిపల్‌లోని 3వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న మసీద్‌కు దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ రూ. 50 వేలు విరాళం ఇచ్చారు. విరాళం డబ్బును శనివారం ముస్లిం మతపెద్దలకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో మహేష్‌ముదిరాజ్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్,సిరగంగబాబు, శివరాజ్, సదన్, జబ్బర్, అక్రమ్ పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి-దుండిగల్)



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్‌లోని డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేయండి

మియాపూర్, సెప్టెంబర్28 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పరిష్కరించాల్సిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శనివారం జలమండలి కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. మియాపూర్ డివిజన్‌లోని డ్రైనేజీ సమస్య, పెండింగ్‌లో ఉన్న పనులు, తాగునీటి పైప్‌లైన్ పనులపై జలమండలి డీజీఎం వెంకటేశ్వరరావు, మేనేజర్ సునీతతో కార్పొరేటర్ చర్చిం చారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రజల దాహార్తి తీర్చడానికి కొత్తలైన్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఈ సంద ర్భంగా కార్పొరేటర్ వారిని కోరారు. అలాగే అవసరమైన ప్రాంతాలకు అదనంగా తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

రాయదుర్గం, సెప్టెంబర్28(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలో రూ.50 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వేగంగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను కోరారు. అనంతరం కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. డివిజన్ ఉపాధ్యక్షుడు తిరుపతి, సీనియర్ నాయకులు భిక్షపతి, శేఖర్, బాలకృష్ణ, హనుమంతు, గణేష్, సుమన్, ప్రసాద్, శ్రీను, రాజు, గోవింద, గణేష్, సుమన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత పాటుపడాలి

జీడిమెట్ల/అల్లాపూర్/బాలానగర్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): దేశసమగ్రతను కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని, భగత్‌సింగ్ కలలు కన్న సమసమాజ స్థాపన కోసం యువత పాటుపాడాలని పలువురు వక్తలు కోరారు. స్వాతంత్ర సమరంలో అసువులు బాసిన 'షహీద్' భగత్ సింగ్ జయంతిని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు.

● 'హిందూ వాహిని' ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌లోని మహాత్మా గాంధీ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కూకట్‌పల్లి బాగ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, అల్లాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గోపాల్ సింగ్ పాల్గొన్నారు. అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటరామ రెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి సుదర్శన్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట, మఖ్దూమ్‌నగర్ భగత్‌సింగ్ మార్గ్‌లోని విగ్రహానికి సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, ఏఐవైఎఫ్ నియోజక వర్గం కార్యదర్శి వెంకటేష్ హరినాథ్, సదానందం, సాహా, రాములు బనివాళులర్పించారు. చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. దళిత చైతన్య కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు నిశాని చందర్, బి.సత్యం, డేగల కృష్ణమూర్తి, వై.నరసింహారెడ్డి, వై.జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



గాజులరామారంలోని భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పున్నారెడ్డి, హరివర్ధన్ సింగ్



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హిందూ వాహిని కార్యకర్తలు

● నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో భగత్ సింగ్ విగ్రహానికి సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, ఎస్ఎంసీ, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆశి యాదయ్య, గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం ముందు భగత్ సింగ్ చిత్రపటానికి ఏఐటీయూసీ నాయకులు నివాళులర్పించారు. గాజులరామారంలోని భగత్ సింగ్ విగ్రహానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, హరివర్ధన్ సింగ్, దండే రాజు, సంజు నివాళులర్పించారు.

చెత్త తరలింపులో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దు: ఎమ్మెల్యే

నిజాంపేట్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): చెత్తను తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లో శనివారం మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై ఆరా తీశారు. కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్లలో నెలకొన్న రోడ్లు, మురుగు నీరు, ఎస్ఎన్‌డీపీ నాలా, ట్రాఫిక్ సమస్యలను అధికారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించడం తో పాటు దోమల నివారణకు తరచూ ఫాగింగ్ చేయాలని సూచించారు. అభివృద్ధి పనులను పూర్తి చేసి త్వరగా ప్రజల కు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కమిషనర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి-మియాపూర్ ఫ్లైఓవర్ పనుల పరిశీలన

బాచుపల్లి ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బాచుపల్లి చౌరస్తా వద్ద సుమారు రూ. 146 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాచుపల్లి-మియాపూర్ ఫ్లైఓవర్, బాచుపల్లి-మల్లంపేట, బౌరంపేట రోడ్డు పనులను, రూ.135 కోట్లతో నిర్మిస్తున్న మియాపూర్, బాచుపల్లి, గండి మైసమ్మ రోడ్డు విస్తరణ పనులను శనివారం అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, హెచ్ఎండీఏ ఎస్ ఈ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 4,032 కేసుల పరిష్కారం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి న్యూ కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి కోర్టుల్లో 4032 కేసులకు పరిష్కారం లభించింది. అంతకు ముందు ఏడీజే తిరుపతి మాట్లాడుతూ, స్నేహపూర్వక వాతావరణంలో రాజీ కుదుర్చుకొని సంతోషంగా ఇక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. ఇక్కడ వెలువరించే తీర్పుపై మళ్లీ హైకోర్టులకు వెళ్లే అవకాశం కూడా ఉండదని, దీని ద్వారా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో కేసులను రాజమార్గంలో రాజీ చేసుకొనేందుకు ఇదొక చక్కటి వేదిక అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది గోవర్ధన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి తాండ్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ టీపీఎస్‌పై వేటు

● ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో స్పందించిన అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మూసాపేట్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఈనెల 24న "డబ్బులిస్తే అక్రమ భవనాలను సీజ్ చేయం", 25న "అక్రమార్కులపై బల్దియా నజర్ " శీర్షికలతో వరుసగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలతో కేపీహెచ్‌బీ టీపీఎస్‌పై వేటు పడింది. కూకట్‌పల్లి జోన్‌లోనే సదరు టీపీఎస్ వ్యవహారం హాట్‌టాపిక్ మారడంతో ఈనెల 26న అతన్ని బదిలీ చేయాలని బల్దియా బాస్‌కు ఫైల్ వెళ్లింది. దీంతో 27వ తేదీన సదరు టీపీఎస్‌ను మూసాపేట్ సర్కిల్ నుంచి చార్మినార్ జోన్ ఫలక్‌నుమా సర్కిల్‌కు బదిలీ చేస్తూ వచ్చిన ఆర్డర్ కాపీ శనివారం మూసాపేట్ సర్కిల్‌కు చేరింది. దీంతో గత కొన్నేళ్లుగా కేపీహెచ్‌బీ డివిజన్ నుంచి మూసాపేట్ సర్కిల్‌లోని ఐదు డివిజన్ల బాధ్యతలను చూస్తూ అవినీతికి కేరాఫ్‌గా మారారన్న విమర్శలు మూటగట్టుకున్నారని సర్కిల్‌లో ఆయన బదిలీపై చర్చించుకుంటున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అల్లాపూర్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ క్యాంపులో బీపీ, షుగర్‌లతో పాటు డెంటల్, కొలెస్ట్రాల్, కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డా. వెంకటేశ్వర్లు, డా. కవిత, డెంటల్ వైద్యుడు డా.మల్లికార్జున, ఇతర వైద్య సి బ్బంది సేవలందించారు. అవంతి నగర్ తోటతో పాటు పరిసర కాలనీల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బలమైన సంకల్పంతో ఏదైనా సాధించొచ్చు

●ప్రఖ్యాత ఇంజనీరు నాగినేని కన్నయ్య నాయుడు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంకల్పం బలంగా ఉంటే దేన్నయినా సాధించవచ్చని ప్రఖ్యాత ఇంజనీరు నాగినేని కన్నయ్య నాయుడు జేఎన్‌టీయూ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇటీవల వరదలకు ప్రమాదంలో చిక్కుకున్న కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌ను, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం బ్యారేజీని రక్షించిన కన్నయ్య నాయుడు శనివారం జేఎన్‌టీయూ నిర్వహించిన మీట్ ది అచీవర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కన్నయ్య నాయుడు మాట్లాడుతూ.. 70వ దశకంలో ఆంధ్రప్రదేశ్‌ను కరువు కబళించగా చిత్తూరు జిల్లాలో నివసిస్తున్న తాను అంబలి తాగి బతికానని చెప్పారు. స్వతహాగా మెకానికల్ ఇంజనీర్‌ని అయిన తనను ఆ దుర్భిక్ష పరిస్థితులు రైతులకు మేలు చేయాలనే తలంపుతో సివిల్ ఇంజనీరింగ్ పనులవైపు పురికొల్పాయని కన్నయ్య నాయుడు తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కుటుంబం నుంచి నేర్చుకున్న విలువలతో జీవితమంతా నిజాయితీగానే బతుకుతున్నానని చెప్పారు. జేఎన్‌టీయూకు ముఖ్యఅతిథిగా వచ్చిన కన్నయ్య నాయుడిని యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్, యూఐఐసీ డైరెక్టర్ రజని, డిప్యూటీ డైరెక్టర్ జె.సురేశ్‌కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు.

ఓల్డ్‌బోయినపల్లి సీపీఎం కార్యదర్శిగా వెంకట నర్సయ్య

ఓల్డ్‌బోయినపల్లి, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఓల్డ్‌బోయినపల్లి శాఖ కార్యదర్శిగా వి. వెంకట్ నర్సయ్య ఏక గ్రీవంగా ఎన్ని కయ్యారు. శుక్రవారం ఉదయం ఓల్డ్‌బోయినపల్లి శాఖ కార్యాలయంలో జరిగిన సీపీఎం సమావేశంలో ఈ నియామకాన్ని చేపట్టారు. అనంతరం భగత్‌సింగ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నాయకులు శ్రీధర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. సత్యం మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, ఎన్, వెంకట్, జాన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

2న వారస్ చెస్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వారస్ చెస్ అకాడమీ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీని అక్టోబర్ 2వ తేదీన నిర్వహించనుంది. టోర్నీ ప్రైజ్ మనీ రూ.1 లక్ష. అలాగే వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకు వారస్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీను కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7396847937 నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు

సెంట్రల్ కిచెన్ నిర్వాహకులకు రూ.2 లక్షల జరిమానా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని ఓ కాలేజీ సెంట్రల్ కిచెన్ నిర్వాహకులకు రూ.2 లక్షల జరిమానా విధించినట్లు జీహెచ్ఎంసీ (హెల్త్) అడిషనల్ కమిషనర్ పంకజ తెలిపారు. అక్షర బాలికల జూనియర్ కళాశాల క్యాంపస్‌లో ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు సెంట్రల్ కిచెన్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వంట గదిలో సరైన పరిశుభ్రత లేదని, పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని రూ. 2 లక్షలు జరిమానా విధించారు.

ఏఈడీతో షాకిస్తే.. గుండె పదిలం

మెడికవర్ ఆస్పత్రి చైర్మన్ డా.అనిల్ కృష్ణ



ఏఈడీ పరికరాన్ని ప్రదర్శిస్తున్న డా. అనిల్ కృష్ణ తదితరులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా అత్యాధునిక ఏఈడీ (ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రి లేటర్) డివైస్‌ను మెడికల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.అనిల్ కృష్ణ అందుబాటులోకి తెచ్చారు. హైటెక్‌సిటీ లోని మెడికవర్ ఆస్పత్రిలో శనివారం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ కాలంలో వృద్ధులతో పాటు యువతలోనూ గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతుందన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలని తెలిపారు. గుండె జబ్బు మరణాలను నియంత్రించే చర్యల్లో భాగంగా ఏఈడీలు, సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతాయని, సాధారణంగా బహిరంగ ప్రదేశాల్లో ఎవరికైనా హఠాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోతే వెంటనే డాక్టర్ అందుబాటులో ఉండర న్నారు. అలాంటప్పుడు వెంటనే ఏఈడీతో ఎలక్ట్రిక్ షాకిస్తే గుండె తిరిగి కొట్టుకోవడం ఆరంభిస్తుం దని తెలిపారు. తర్వాత వీలైనంత త్వరగా బాధితుల్ని ఆస్పత్రికి తర లించి ప్రాణాలు కాపాడవచ్చ న్నారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ సతీష్ కుమార్ కైలాసం మాట్లాడుతూ, ఏఈడీలతో షాక్ ఇవ్వడానికి వైద్య నిపుణులు అక్కర్లేదని, పారామెడికల్స్ కూడా లేకుండా ఒకటికి, రెండు సార్లు చూసిన వారు కూడా ఏఈడీని ఆపరేట్ చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్స్, సీనియన్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా 'సెయింట్ జేవియర్' పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సెయింట్ జేవియర్ హైస్కూల్ పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మూసాపేట గూడ్స్‌షెడ్‌రోడ్డులోని సెయింట్ జేవియర్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కూకట్‌పల్లి ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. 1985 నుంచి 2007 వరకు పదో తరగతి చదివిన సుమారు 450 మంది విద్యార్థులు, 40 మంది టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదికపై చేరి ఆర్థికంగా వెనకబడిన వారికి ఉద్యోగ, ఉపాధి, వైద్యం తదితర వాటిల్లో తమవంతు సహకారం అందించాలని తీర్మానించారు.

17 పబ్‌లపై కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగిస్తున్న పబ్‌లతో పాటు.. ఎంటర్‌టైన్మెంట్, అమ్యూజ్‌మెంట్ లైసెన్స్‌లు లేకుండా మ్యూజిక్ సిస్టంను వినియోగిస్తున్న 17 పబ్‌లపై సైబరాబాద్ పోలీసులు కొరఢా ఝుళిపించారు. 17 పబ్‌ల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. రోజు రోజుకు పబ్‌లలో డీజే సౌండ్స్ ఎక్కువగా వినిపించడం, సౌండ్ పొల్యూషన్‌తో పాటు, అక్కడి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో.. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దింపారు. పీసీబీ అధికారులతో పాటు, పోలీస్ సిబ్బందిని జతచేసి 3 స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. మాదాపూర్ జోన్‌లో నిబంధనలు పాటించకుండా, సరైన లైసెన్స్‌లు లేకుండా నడుస్తున్న పబ్‌లపై కేసులు నమోదు చేశాయి.

బంజారా హక్కుల సాధనకు పోరాడాలి

నిజాంపేట్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని జగదాంబ ఆలయంలో సేవాలాల్ మహారాజ్ 10వ ఆవిర్భావ దినోత్సవ జెండా పండుగను సేవాలాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర నాయక్ మాట్లాడుతూ, బంజారా హక్కుల సాధన కోసం నాయకులందరూ ఏక్‌సాత్.. ఏక్ జాత్.. ఏక్‌వాథ్ నినాదంతో రాజ్యాధికారం కోసం పని చేస్తూ, సమానహక్కుల కోసం పోరాడాలన్నారు. బంజార సేవాలాల్ నాయకులు త్వరలోనే పార్టీని స్థాపించబోతున్నారని, దీనికి బంజారా కుటుంబ సభ్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సేవా సంఘం సభ్యులు రాములునాయక్, హర్యానాయక్, బాలాజీ నాయక్, రమేష్ నాయక్, రాజునాయక్, ఈరన్ననాయక్, ఉపేంద్రనాయక్ పాల్గొన్నారు.

కార్యాలయాల నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడిన బాచుపల్లి, దుండిగల్, గండిమైసమ్మ, కుత్బుల్లాపూర్ మండలాలకు చెందిన విద్యాధికారులు జెమిని, కృష్ణ, రామకృష్ణలు శనివారం జీడిమెట్ల డివిజన్‌లోని పేట్ బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిశారు. శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మూడు మండలాల్లో కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్ మెన్ గదుల నిర్మాణం, మంచి నీటి సరఫరా వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువ చ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ రమేష్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయరాలు పాల్గొ న్నారు.



సనాతన ధర్మాన్ని కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

వెంకటేశ్వర ఆలయంలో 'జనసేన' ప్రాయశ్చిత్త దీక్ష

చందానగర్, సెప్టెంబర్28 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ అపవిత్రమైన నేపథ్యంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా శనివారం ఆ పార్టీ శేరిలింగంపల్లి అధ్యక్షుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్షను కొనసాగించారు. కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన నాయకులు తరలివచ్చి ఆలయాన్ని శుద్ధి చేసి మౌన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

వరద బాధిత పిల్లల కోసం నోట్‌బుక్స్ అందజేత

ఫతేనగర్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని విజయవాడ ప్రాంతాల్లో వరదల్లో సర్వం కోల్పోయిన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ అందిం చేందుకు దాతలు ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీంరెడ్డి, ఆదేశాల మేరకు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సలహా సూచనలతో యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ మణిదీప్ 5 వేల నోట్‌బుక్స్, స్టేషనరీని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హైదరాబాద్ జిల్లాల శాఖకు అందజేశారు. బాలానగర్ ఫిరోజ్‌గూడ ఎస్ఎస్‌కేకే స్కూల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, స్కూల్ హెడ్మిస్ట్రెస్ సునీధ, స్కూల్ సెక్రెటరీ బాబు ఉన్నిన్నీ పాల్గొన్నారు.



విరాళం చెక్కును ఎమ్మెల్యే గాంధీకి అందజేస్తున్న 'మైహోమ్ జెవెల్ ఫ్లాట్ ఓనర్స్' అసోసియేషన్ సభ్యులు

సీఎం సహాయనిధికి 'మైహోమ్ జెవెల్' రూ.5 లక్షల విరాళం

మియాపూర్, సెప్టెంబర్28(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం మదీనాగూడలోని మైహోమ్ జెవెల్ ఫ్లాట్ ఓనర్స్ సీఎం సహాయ నిధికి రూ.5లక్షలు శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి అందజేశారు. వినాయక నవరాత్రి పర్వదినం సందర్భంగా వినాయక లడ్డూ వేలం పాటలో వచ్చిన రూ.5 లక్షలు వరద బాధితులకు అందజేయాలని నిర్ణయించుకున్నటు మైహోమ్ జెవెల్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సొసైటీ సభ్యులు ప్రశాంత్, మురళీధర్‌రావు, మహేష్‌బాబు, రవికుమార్, రాజేంద్రన్ మురుగేషన్, ఎంఎస్‌రావు, రవి పాల్గొన్నారు.

చార్జింగ్‌తో మంటలు చెలరేగి మెడికల్ షాపు దగ్ధం



గాజులరామారం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపులో ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనానికి చార్జింగ్ పెట్టగా ప్రమాదవశాత్తూ ఆ వాహనంలో మంటలు వ్యాపించాయి. దీంతో షాపుతో పాటు ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయాయి. సూరారం పోలీసుల కథనం ప్రకారం... శనివారం ఉదయం సూరారం ఎక్స్ రోడ్డులోని ఆదిత్య మెడికల్ షాపులో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడుతుండగా స్థానికులు గమనించి జీడిమెట్లలోని అగ్నిమాపక కేంద్రానికి, సూరారం పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలనాకి చేరుకొని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ. 40 లక్షల ఆస్తి నష్టం జరిగిందని మెడికల్ షాపు యాజమాని విక్రమ్‌రెడ్డి తెలిపారు. సూరారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.